క్లుప్తంగా

గణితం పరీక్షకు 115 మంది గైర్హాజరు

నూజివీడు: పట్టణంలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో మంగళవారం నిర్వహించిన పదో తరగతి సప్లిమెంటరీ గణితం పరీక్షకు 115 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 860 మందికి 745 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఎస్ఆర్ఆర్ హైస్కూల్ సెంటర్లో 195 మందికి 171మంది, బాలికల జెడ్పీ హైస్కూల్లో 177 మందికి 155 మంది, సెయింట్ థామస్ హైస్కూల్లో 173 మందికి 154 మంది, సెయింట్ ఆన్స్ హైస్కూల్లో 136 మందికి 110 మంది, లేయా హైస్కూల్లో 179 మందికి 155 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమలు చేశారు.

కళాజాతా ప్రచారం

నూజివీడు: కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో స్థానిక గ్లోబల్ స్టూడెంట్ అవేర్నస్ ఆర్గనైజేషన్కు చెందిన మిరియాల శేఖర్బాబు కళాజాతా బృందం మంగళవారం ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ప్లాస్టిక్ కవర్లు వాడి పారేయడం వల్ల ఇవి భూమి పొరల్లో వందల ఏళ్ల వరకు ఉండిపోతాయన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో భూమి నిండిపోయి అనేక అనర్థాలు సంభవిస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ రహిత జీవనాన్ని కొనసాగించాలన్నారు. పర్యావరణ హితమైన జీవనాన్ని సాగించాలన్నారు.

నేటి నుంచి బస్పాస్లు జారీ

మైలవరం: స్థానిక ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్లో బస్పాస్లు జారీ చేస్తామని తిరువూరు డిపో మేనేజర్ వేణు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాసుల జారీ చేయడానికి బుధవారం నుంచి కౌంటర్ ప్రారంభిస్తున్నామన్నారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తెలిపారు.

పంచాయతీ కార్యదర్శుల బదిలీ

తిరువూరురూరల్: మండలంలోని ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు బదిలీపై వెళ్లారు. మునుకుళ్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేష్ విస్సన్నపేట మండలం తాతకుంట్లకు, కొమ్మిరెడ్డిపల్లిలో పనిచేస్తున్న సునీల్ పెనుగంచిప్రోలు మండలానికి బదిలీపై వెళ్లారని ఇన్చార్జి ఎంపీడీవో నాగేశ్వరరావు తెలిపారు.

తహసీల్దార్గా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ



ఇబ్రహీంపట్నం: మండల నూతన తహసీల్దార్గా ఎం.శ్రీనివాసరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ కార్యాలయంలో సీసీఎల్గా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ తహసీల్దార్గా విధులు నిర్వహించిన ఎం.సూర్యారావును జగ్గయ్యపేట తహసీల్దార్గా బదిలీ చేశారు. కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది నూతన తహసీల్దార్ శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపారు. బదిలీ అయిన సూర్యారావుకు వీడ్కోలు పలికారు.

ఆటో ఢీకొని చిరువ్యాపారికి గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రోడ్డు దాటుతున్న చిరు వ్యాపారిని ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో చిరువ్యాపారి గాయపడ్డాడు. ఈ ఘటన కొత్తపేట పోలీస్స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. అంబాపురానికి చెందిన పెండ్ర శ్రీను (44) చిట్టినగర్ డౌన్లో పండ్లు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం శ్రీను కొత్త అమ్మవారి గుడి వద్ద రోడ్డు దాటుతుండగా చిట్టినగర్ వైపు నుంచి పాలప్రాజెక్టు వైపు వెళ్తున్న ఆటో వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో శ్రీనుకు గాయాలు కావడంతో ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు.

దోమల నివారణతో మలేరియాకు చెక్

జిల్లా మలేరియా అధికారి పీఎస్ఎస్వీ ప్రసాద్

నూజివీడు: దోమల వ్యాప్తిని అరికట్టడం ద్వారానే మలేరియాను పూర్తిగా నివారించొచ్చని జిల్లా మలేరియా అధికారి పీఎస్ఎస్వీ ప్రసాద్ అన్నారు. నూజివీడు మండలం దిగవల్లి పీహెచ్సీలో మలేరియా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం సిబ్బందికి, ఆశావర్కర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే మలేరియా వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. మలేరియా ప్లాస్మోడియా అనే పరాన్నజీవి వల్ల వస్తుందన్నారు. అనాఫలిస్ దోమ కాటు వల్ల మనుషులకు వ్యాపిస్తుందని చెప్పారు. దోమకాటుకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని



దిగవల్లి పీహెచ్సీలో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి ప్రసాద్

సూచించారు. ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని అన్నారు. ప్రజలు తప్పనిసరిగా దోమ తెరలు వాడటం ద్వారా దోమ కాటు నుంచి రక్షణ పొందవచ్చన్నారు. ఖాళీ టైర్లు, పేపర్ గ్లాసులు, ప్లాస్టిక్ గ్లాసులు, ఖాళీ కొబ్బరి బొండాలు తదితర వాటిల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్సీ వైద్యాధికారి శ్రీనివాస్, సబ్ యూనిట్ అధికారి యలమంద, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలని వినతి

వెల్వడం(మైలవరం): మైలవరం మండలం వెల్వడం గ్రామం బీసీ కాలనీలో డ్రెయినేజీ లేక పడుతున్న ఇబ్బందులను కాలనీకి చెందిన బీసీ నాయకులు కొందరు వైఎస్సార్ సీపీ నాయకులు యరమల రాంభూపాల్రెడ్డిని మంగళవారం కలిసి వివరించారు. దీనిపై స్పందించిన వైఎస్సార్ సీపీ నాయకులు రాంభూపాల్రెడ్డి గ్రామానికి చెందిన ప్రవాస భారతీయులు డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. డాక్టర్ హనిమిరెడ్డి స్పందించి బీసీ కాలనీలో డ్రెయినేజీల నిర్మాణానికి ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో రాంభూపాల్రెడ్డి, గ్రామ సర్పంచ్ పీ ధర్మరాజు, వైస్ ఎంపీపీ పీ రత్నబాబు, ఎంపీటీసీ సభ్యుడు ఉదయ్భాస్కర్రెడ్డి, వార్డు సభ్యులతో కలిసి కాలనీలో డ్రెయినేజీలు పరిశీలించారు. ఈ సందర్భంగా దాతృత్వాన్ని ప్రకటించిన ప్రవాసాంధ్రులు డాక్టర్ హనిమిరెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.



వెల్వడం బీసీ కాలనీలో డ్రెయినేజీ సమస్య వివరిస్తున్న గ్రామస్తులు

మండలానికి 47 వేల పాఠ్యపుస్తకాల సరఫరా

నూజివీడు: గతంలో ఎన్నడూ లేని విధంగా రాబోయే విద్యాసంవత్సరానికి పాఠశాలలు తెరవక ముందే రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను సిద్ధం చేసింది. పాఠశాలలు తెరిచేనాటికి ప్రతి విద్యార్థి చేతిలోనూ పాఠ్యపుస్తకాలు ఉండాలన్నది ప్రభుత్వ లక్ష్యం. పాఠ్యపుస్తకాలు ఇప్పటికే పట్టణంలోని స్టాక్ పాయింట్కు చేరుకున్నాయి. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు 74 వేల పాఠ్యపుస్తకాలు అవసరం కాగా, మొదటి విడతగా 47 వేల పాఠ్యపుస్తకాలు ఎస్ఆర్ఆర్ హైస్కూల్లోని స్టాకు పాయింట్కు చేరాయి. మిగిలిన 27 వేల పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉంది.



ఎస్ఆర్ఆర్ హైస్కూల్లోని స్టాకు పాయింట్కు చేరిన పాఠ్యపుస్తకాలు

వీటిని సెట్లవారీగా పాఠశాలలకు పంపేందుకు సీఆర్పీలు సిద్ధం చేస్తున్నారు. జగనన్న విద్యాకానుక కిట్లు కూడా వచ్చాయి.

శివగంగ శ్రీశారదా పీఠాధిపతి ప్రత్యేక పూజలు



జి.కొండూరు: ధర్మపర్యవేక్షణార్థం దేశయాటన చేస్తున్న శివగంగ శ్రీ శారదాపీఠాధిపతి పురుషోత్తమ భారతీస్వామి తన స్వగ్రామం వెల్లటూరు గ్రామాన్ని మంగళవారం సందర్శించారు. స్థానికంగా ఉన్న శ్రీ వేణుగోపాలస్వామి, రామలింగేశ్వరస్వామి దేవాలయాల్లో విశేష అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు అనుగ్రహ భాషణ చేశారు. గ్రామంలో ఉన్న గోశాలను సందర్శించిన స్వామిజీ, గోవులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అమృత సరోవర్ పనుల పరిశీలన

చాట్రాయి: ఉపాధి హామీ పథకంలో చేపట్టిన అమృత సరోవర్ ప్రాజెక్టు పనులను మంగళవారం ప్రాజెక్టు అధికారులు పరిశీలించారు. చాట్రాయి మండలం కోటపాడు, చనుబండ, ఆరుగొలనుపేట, సోమవరం గ్రామాల్లోని చెరువుల్లో సుమారు రూ.50 లక్షలతో పనులు చేపట్టారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారులు విద్యాసాగర్, రమణ, ఏపీఎం లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముసునూరు: మతి స్థిమితంలేక పురుగు మందు తాగి ఆసుపత్రిపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్ఐ ఎం.కుటుంబరావు తెలిపారు. కాట్రేనిపాడుకు చెందిన మల్లేల భూషణం (57) వార్ధక్యం కారణంగా మతిస్థిమితం లేక శనివారం వంగ మొక్కలకు వాడే పురుగుల మందు తాగాడు. విజయవాడ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్టు తెలిపారు.

రెవెన్యూ అధికారుల బదిలీ

తిరువూరు: మండలంలోని పలువురు గ్రామ రెవెన్యూ అధికారులు సాధారణ బదిలీపై వెళ్లారు. అక్కపాలెం వీఆర్వో వాణి వత్సవాయి మండలానికి, నడిం తిరువూరు వీఆర్వో స్వాతి గంపలగూడెంకు, రాజుపేట వీఆర్వో కోట రాణి ఏ కొండూరు మండలానికి, ఎర్రమాడు వీఆర్వో జమలయ్య విస్సన్నపేటకు, ఎలక్షన్ డీటీ ప్రసాద్ మైలవరంకు, రోలుపడి వీఆర్వో కనకదుర్గ పుట్రేలకు బదిలీపై వెళ్లారు. ఎలక్షన్ డీటీగా నాగమణి, వీఆర్వోలుగా రాజుపేటకు వెంకటేశ్వరరావు, వామకుంట్లకు గోదా శ్రీనివాసరావు, నడిం తిరువూరుకు సాయిబాబు, ముష్టికుంట్లకు జయరాజు నియమితులయ్యారని తహసీల్దారు సురేష్బాబు తెలిపారు. ఇంకా ఐదుగురు వీఆర్వో పోస్టులు భర్తీ కావలసి ఉందన్నారు.

రెవెన్యూ సిబ్బంది బదిలీ

గంపలగూడెం: మండలం నుంచి ముగ్గురు రెవెన్యూ సిబ్బంది బదిలీ కాగా, ఐదుగురు ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చారు. తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి మంగళవారం వివరాలు వెల్లడించారు. డెప్యూటీ తహసీల్దార్ రాధికారాణి వత్సవాయి తహసీల్దార్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఇప్పటి వరకు ఇక్కడ ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్ పోస్టు భర్తీ చేశారు. రెడ్డిగూడెం తహసీల్దార్ కార్యాలయం నుంచి బిక్షపత్ బదిలీపై జేఏగా వచ్చారు. అనుముల్లంక వీఆర్వో మరకల వెంకటేశ్వరరావు తిరువూరు రాజుపేటకు బదిలీ కాగా మండలంలోని పెద్దకొమిర వీఆర్వో సీతామహాలక్ష్మి అనుముల్లంకకు బదిలీ అయ్యారు. అర్లపాడు వీఆర్వో వెలగ శ్రీనివాసరావు తిరువూరు శాంతినగర్కు బదిలీ కాగా విస్సన్నపేట నుంచి కాంతారావు ఇక్కడకు వచ్చారు. గత కొంత కాలంగా ఖాళీగా ఉన్న గంపలగూడెం-1 వీఆర్వోగా తిరువూరు నుంచి రావూరి స్వామి బదిలీపై వచ్చారు. ఏ.కొండూరు మండలం చీమలపాడు నుంచి షేక్ నాగుల్మీరావలీ ఊటుకూరు వీఆర్వోగా వచ్చారు. పెద్దకొమిర వీఆర్వోగా ఏ.కొండూరు మండలం పోలిశెట్టిపాడు నుంచి ప్రేమ్కుమార్ బదిలీపై వచ్చినట్లు తహసీల్దార్ వివరించారు.

ఏవోగా నారాయణ

తిరువూరు: స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా (ఏవో) బీ నారాయణ నియమితులయ్యారు. నూజివీడు సబ్ కలెక్టరు కార్యాలయంలో డీఏవోగా పనిచేస్తున్న ఆయన తిరువూరు ఆర్డీవో కార్యాలయంలో ఖాళీగా ఉన్న పోస్టులో ఏవోగా నియమితులయ్యారు.

గ్రంథాలయాల్లో విద్యార్థులకు వేసవి శిక్షణ

మైలవరం: విద్యార్థులు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల లైబ్రేరియన్ టీ సాంబశివరావు తెలిపారు. మైలవరం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో మంగళవారం విద్యార్థులతో రామాయణం కథల పుస్తకాన్ని చదివించారు. అనంతరం సాంబశివరావు మాట్లాడుతూ సమాజంలో విద్యతోనే గుర్తింపు లభిస్తుందన్నారు. చిన్నతనం నుంచే విద్యార్థులు ఒక గమ్యం నిర్ణయించుకుని ఆ దిశలో ప్రయాణించాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది సయ్యద్ అహ్మద్, రాజేంద్రప్రసాద్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు: గోపవరం గ్రంథాలయంలో బ్రాంచి అధికారి సునీల్కుమార్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా 30వ రోజు మంగళవారం చిన్నారులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. సమాజంలో రుగ్మతలను, మూఢ నమ్మకాల నిర్మూలనకు చిత్ర లేఖనం ద్వారా మార్పు తీసుకు రావచ్చునని ఉపాధ్యాయులు బాలలకు వివరించారు.



మైలవరం గ్రంథాలయంలో మాట్లాడుతున్న లైబ్రేరియన్ సాంబశివరావు



గోపవరంలో చిత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కార్యక్రమంలో పలువురు పాఠకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రీవారి కల్యాణం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవం మంగళవారం రాత్రి ఆలయ కళ్యాణ మండపంలో కనుల పండువగా జరిగింది. చిట్టినగర్లోని స్వామి దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మూడో రోజైన మంగళవారం ప్రత్యేక హోమాలు, సామూహిక కుంకుమార్చనలు, స్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో నిత్య హోమాలు, పంచసూక్త హోమం నిర్వహించారు. సాయంత్రం నిత్యం, బలిహరణాలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకుడు వినుకొండ రత్నమాచార్యులు, సహాయ అర్చకులు శ్రీనివాసులు, గోపినాథ్తో పాటు తిరుమల తిరుపతి దేవస్థానం వేద పాఠశాల విద్యార్థులు వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం కల్యాణ వేదిక వద్ద సామూహిక కుంకుమార్చనలు నిర్వహించగా, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

స్వామి వారి సేవలో ప్రముఖులు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి వార్లను మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. స్వామి వారిని రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్.పి.సిసోడియా దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. ఆయనకు దేవస్థాన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు స్వామి వారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.



స్వామి వారిని దర్శించుకున్న సిసోడియాకు స్వామి వారి ప్రసాదాలు అందచేస్తున్న కమిటీ ప్రతినిధులు

మొక్కలు నాటితేనే మనుగడ

ఇబ్రహీంపట్నం: సమాజంలో మనుగడకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, సంరక్షించాలని ఏపీజెన్కో థర్మల్ డైరెక్టర్ జి.చంద్రశేఖర్రాజు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురష్కరించుకుని ఎన్టీటీపీఎస్లో మంగళవారం మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ మనుషులకు జీవనాధారం మొక్కలే అన్నారు. పర్యావరణంకు హాని కలిగించని వస్తువులు మన జీవితంలో భాగం కావాలన్నారు. గాలి, నీరు, భూమి కాలుష్యం కాకుండా చూసుకోవల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. చీఫ్ ఇంజినీర్లు నవీన్గౌతమ్, అశోక్కుమార్రెడ్డి, పలువురు ఎస్ఈలు, డీఈలు, ఏఈలు, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న జెన్కో థర్మల్ డైరెక్టర్ చంద్రశేఖర్రాజు, తదితరులు

అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే చర్యలు

తిరువూరు: రైతులకు అవసరమైన విత్తనాలను నిర్ణీత ధరకు మాత్రమే విక్రయించాలని తిరువూరు సహాయ వ్యవసాయ సంచాలకులు కెనడీ విత్తన డీలర్లను ఆదేశించారు. స్థానిక మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో మంగళవారం విత్తన డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గరిష్ఠ ధరను మించి విత్తనాలను విక్రయించరాదని, రైతులకు రసీదు తప్పక ఇవ్వాలని, నాణ్యత కలిగిన విత్తనాలను మాత్రమే అమ్మాలని సూచించారు. లైసెన్సు లేకుండా విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవసాయాధికారి పద్మ, డీలర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ కెనడీ

లంక భూముల్లో హైఓల్టేజ్ ట్రాన్స్ఫార్మర్లు

ఇబ్రహీంపట్నం: మండలంలోని చినలంక వ్యవసాయ భూముల్లో హైఓల్టేజ్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్ స్కీమ్ను ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్శాఖ ఏఈ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సూచనలతో రైతులకు మెరుగైన విద్యుత్ అందించేందుకు మూడు మోటార్లకు ఒక ట్రాన్స్ఫార్మర్ చొప్పున రూ.10 లక్షల వ్యయంతో ఐదు ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేశారు. వరదల తాకిడిని తట్టుకునేందుకు ఎత్తైన స్తంభాలు కూడా ఏర్పాటు చేశారు. ట్రాన్స్ఫార్మర్ ఏర్పాట్లు వైఎస్సార్ సీపీ నాయకులు లంకే అంకమోహనరావు, నల్లమోతు ప్రకాష్, ఎన్.దయాకర్ పర్యవేక్షించారు.



లంక భూముల్లో ఏర్పాటు చేసిన ట్రాన్స్ఫార్మర్

ముమ్మరంగా ఉపాధి పనులు

చాట్రాయి: మండలంలోని అన్ని గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నారు. వ్యవసాయ పనులు లేకపోవడంతో కూలీలు ఎక్కువగా వస్తున్నారు. ఉదయం 7 గంట నుంచి 10 గంటల వరకు పనులు చేస్తున్నారు. 10 వేల మంది లక్ష్యం కాగా రోజుకి సగటున 6,500 మంది కూలీలు పనుల్లో పాల్గొంటున్నారు. వేసవి అలవెన్స్తో కలుపుకుని మనిషికి సగటున రూ.242 నుంచి రూ.250 వరకు వేతనం పడుతోంది. చెరువుల్లో పూడిక, చెరువు కట్టలు బలిష్టం, పంట కాలువల్లో పూడిక తీత లాంటి పనులు చేస్తున్నారు.



చనుబండలో చెరువు పనులు చేస్తున్న కూలీలు

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణ పద్మశాలీ సంక్షేమ సంఘం వారి ఆధ్వర్యంలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం కూడలిలో ఏర్పాటుచేసిన చలివేంద్రంలో మంగళవారం ఆయుర్వేద మజ్జిగ పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షుడు పెనుమల్లి చంద్రమౌళి మాట్లాడుతూ దాత గజం నాగ శివరాం సహకారంతో 3 వేల మందికి మజ్జిగ పంపిణీ చేశామన్నారు. తొలకరి వర్షాలు పడి వాతావరణంలో మార్పు వచ్చేంత వరకు ఈ శిబిరం కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, సభ్యులు పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పనికి వేరే ఊరు వెళ్లిన తన భర్త కనిపించడం లేదంటూ ఓ మహిళ కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. కొత్తపేట శ్రీనివాసమహల్ పోతిన అప్పన్న వీధికి చెందిన గేదెల రాజువేణి, అప్పన్న భార్యాభర్తలు. రాజువేణి ఇళ్లలో పనులు, అప్పన్న ముఠా పని చేస్తుంటాడు. రెండు నెలల కిందట అప్పన్న నెల్లూరులో పని ఉందని వెళ్లాడు. తరచూ భార్యకు ఫోన్ చేసి మాట్లాడేవాడు. 15 రోజులుగా అప్పన్న నుంచి ఫోన్ రాకపోవడంతో ఆందోళన చెందిన రాజువేణి నెల్లూరు వెళ్లి ఆరా తీసి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కుక్కల దాడిపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కుక్కల దాడికి కారణమైన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఓ మహిళ కొత్తపేట పోలీసులు మంగళవారం ఫిర్యాదు చేసింది. వాగు సెంటర్ బ్రహ్మంగారి మఠానికి చెందిన సాయిలక్ష్మి, గోపికృష్ణ భార్యాభర్తలు. వారి నివాసం ఉండే ప్రాంతానికి దగ్గరలో నివసించే గుర్రాల మహేష్ కుక్కలను పెంచుతాడు. పెంపుడు కుక్కలతో పాటు వీధి కుక్కలకు కూడా ఆహారం అందిస్తుంటాడు. మంగళవారం ఉదయం సాయిలక్ష్మి కుమార్తె మేఘన, తల్లి సరోజ ఇంటి నుంచి బయటకు వెళ్తున్న తరుణంలో కుక్కలు వెంట పడి గాయపరిచాయి. దీంతో మహేష్పై పోలీసుకు ఫిర్యాదు చేసింది.

19 నుంచి ఇంద్రకీలాద్రిపై ఆషాఢ మాసోత్సవాలు

- నెల రోజులు దుర్గమ్మకు సారె పండుగ
- జూలై 1 నుంచి శాకంబరీదేవి ఉత్సవాలు
- మూడు రోజులు అమ్మవారికి కాయగూరలు, ఆకుకూరలతో అలంకరణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై ఈ నెల 19వ తేదీ నుంచి జూలై 17వ తేదీ వరకు నెల రోజుల పాటు ఆషాఢ మాసోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మాసంలో భక్తులు అమ్మవారికి సారె సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో ఆషాఢ మాసం తొలి రోజైన 19వ తేదీన ఆలయ స్థానాచార్య, వైదిక కమిటీ సభ్యులు అమ్మవారికి తొలి సారె సమర్పిస్తారు. జూలై 17వ తేదీన దేవస్థానం తరఫున ఈఓ, ఆలయ అధికారులు, సిబ్బంది అమ్మవారికి సారె సమర్పిస్తారు. నెల రోజుల పాటు రాష్ట్రంలోని పలు ఆలయాలతో పాటు సేవా బృందాలు, భక్త బృందాలు అమ్మవారికి సారె సమర్పించేందుకు ఇంద్రకీలాద్రికి తరలివస్తాయి. ఈ నేపథ్యంలో అమ్మవారికి సారెను సమర్పించేందుకు విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూసేలా దేవస్థానం ఏర్పాట్లు చేయనుంది.



ఆషాఢ మాసోత్సవాల్లో దుర్గమ్మకు సమర్పించిన సారె (ఫైల్)

మూడు రోజులు శాకంబరీదేవి ఉత్సవాలు

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై ఆషాఢ శుద్ధ త్రయోదశిని పురస్కరించుకుని జూలై ఒకటో తేదీ నుంచి ఆషాఢ పౌర్ణమి వరకు మూడు రోజుల పాటు శాకంబరీదేవి ఉత్సవాలు నిర్వహించనున్నారు. సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలతో రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో అలంకరిస్తారు. అమ్మవారికి అలంకరించిన కూరగాయలు, ఆకుకూరలు ఉపయోగించి తయారు చేసే కదంబ ప్రసాదం ఎంతో విశేషం. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులందరికీ ఈ ప్రసాదం పంపిణీ చేస్తారు. జూలై మూడో తేదీ ఉదయం పది గంటలకు పూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తం అవుతాయి.